


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

**తన తల్లితో** ఉండే ఓ కొడుకు తల్లి అభీష్టానికి వ్యతిరేకంగా ఓ అమ్మాయిని రహస్యంగా వివాహం చేసుకున్నాడు. తన భార్యని వేరే ఇంట్లో ఉంచి రోజూ ఏదో ఓ సమయంలో ఆమె దగ్గరకి వెళ్ళేవాడు. ఇలా రెండేళ్ళు గడిచాక రెండు ఇళ్ళు మెయిన్‌టెయిన్ చేయడం ఆర్థిక భారంగా ఉండీ అతను ఓ రోజు తన తల్లితో ఆ విషయం సాధ్యమైనంత మృదువుగా చెప్పదలచుకున్నాడు.



"అమ్మా! నీకు చెప్పకుండా నేనో పాడుపని చేశాను. రెండేళ్ళ క్రితమే నేను సరళని వివాహం చేసుకున్నాను. కొత్తపేటలో ఓ ఇంట్లో కాపురం చేస్తున్నాము. నాకో కొడుకు కూడా!"

అది విన్న తల్లి నిశ్చేష్టురాలైంది. కొద్ది క్షణాలాగి కోపంతో చెప్పింది..

"నువ్వు ఎంత దుర్మార్గుడివిరా.. నీకు భార్య ఉండి కూడా ఇంతకాలం నీ బట్టలని నాచేత ఇస్త్రీ చేయిస్తున్నావా?"

.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

కోర్టులో ముద్దాయి తరపు న్యాయవాది సాక్షిని తికమక పెడుతున్నాడు.

"ముద్దాయి ఇంట్లో జొరబడుతుండగా చూశావా?"

"చూశాను."

"మీ ఇంటికి, ఆ ఇంటికి ఎంత దూరం ఉంటుంది?"

"దగ్గర దగ్గర ఫర్లాంగుండొచ్చు"

"బాగా చీకటిగా ఉందా?"

"ఆ ఉంది."

"అయితే, చీకటిగా ఉన్నప్పుడు ఫర్లాంగు దూరంలో ఏం జరుగుతున్నదో స్పష్టంగా చూశావా?"

"చూశానండి"

"దేవుడు నీకు ప్రత్యేకమైన చూపు ఇచ్చాడా? చీకట్లో ఎంత దూరం చూడగలననుకుంటున్నావు?"

"ప్లీడరు గారూ. నేనూ మీలాంటి వాడినే నండీ.. ఆకాశంలో చుక్కలు ఎంత దూరంలో ఉన్నాయి! వేలమైళ్ళ దూరంలో ఉన్న వాటిని చూడగలుగుతున్నప్పుడు, ఫర్లాంగు దూరంలో ఉన్నదొక లెఖ్ఖా?"

"ఏమిటిరా అలా దిగులుగా ఉన్నావ్?"

"ఏముంది? సంసార సాగరం ఈదలేక"

"అదేమిటి ఎప్పుడూ నా గృహం ఒక స్వర్గసీమ, నా భార్య ఒక రత్నం అంటుండేవాడివి కదా!"

"అవును. ఆ రత్నం ఏ గనినుంచి వచ్చిందో, ఆ గని అంతా వచ్చి మా స్వర్గసీమలో తిష్టవేసింది. ఆ గని ఇప్పట్లో మా ఇల్లు వదిలి కదిలేలా లేదు."

"ఎందుకనిరా పెళ్ళి చేసుకోనంటున్నావీ మధ్య."

"స్త్రీ స్వభావం బాగా తెలిసొచ్చింది గనుక"

"ఎట్లా?

"ఆ మధ్య సినిమాహాలు దగ్గర వత్తిడిలో చూడక ఒకావిడ కాలు తొక్కాను. అప్పుడామె 'ఫూల్' అంది. పొరపాటైనా తప్పేగదాని నేనూరుకున్నాను. ఇంతలో ఆవిడ నాకేసి చూసి, నాలిక్కరుచుకుని, 'క్షమించండి. కాలు తొక్కింది మావారు అనుకుని అలా అన్నాను. దయచేసి మీరు అపార్ధం చేసుకోకండి' అని క్షమాపణలు చెప్పుకుంది."

❦❦❦

"చేతులు కట్టుకు నిలబడ్డాడు ఒక యువకుడు హోటల్ యజమాని ముందు.

"ఇదివరకే హోటల్లోనయినా పని చేశావా? సర్వింగ్ బాగా తెలుసా?"

"క్షుణ్ణంగా తెలుసు సార్. నేను రెండు విధాలుగా సర్వ్ చేయగలను."

"రెండు విధాలా?"

"అవును సార్. మన సర్వీస్‌తో తృప్తిపడి హోటల్‌కు మళ్ళీ మళ్ళీ వచ్చేట్టుగా చేయడం ఒక రకం. వచ్చినవాడు విసిగిపోయి, ఎందుకొచ్చాన్రా బాబూ అని బయపడి మళ్ళీ మన గుమ్మం తొక్కకుండా ఉండేలా సర్వ్ చేయడం రెండో రకం సార్."

❦❦❦

ఇరుగు పొరుగు అమ్మలక్కలంతా ముక్కుమీద వేలేసుకున్నారు. రాజమ్మ ఇంట్లోంచి పారిపోయిందని తెలియగానే. అందరూ ఒక చోట చేరి ఒకటే గుసగుసలు. అసలెక్కడికెళ్ళింది? ఎవరితోనయిన లేచిపోయిందా? పుట్టింటి కెళ్ళిందా? సమస్య తెగటంలేదు.

"ఇది విన్నావా? రాజమ్మ మొగుడు కూడా ఇల్లు తాళం వేసి ఎక్కడికో వెళ్ళిపోయాట్ట. నెల రోజులదాకా తిరిగిరానని ఇల్లుగల వాళ్ళతో చెప్పి మరీ బయలుదేరాడట" అంది వాళ్ళలో ఒక ఆశమ్మ.

"ఏం చేస్తాడు పాపం. పెళ్ళాం రాజమ్మ మనసు మార్చుకుని మళ్ళీ ఎక్కడ తిరిగొస్తుందోనని భయపడి పారిపోయుంటాడు."

ఓ పెద్ద బట్టల షాపులో ఇద్దరు దంపతులు ప్రవేశించారు. ఇద్దరూ ఓ కౌంటర్ దగ్గర నిలబడి ఆయనకు కావలసిన పాంట్ గుడ్డలు చూడటం ప్రారంభించారు. కాసేపట్లో పాంటు గుడ్డలు ప్యాక్ చేయించుకుని చూసేటప్పటికి పక్కన భార్యలేదు. ఆయన అయిదారు కౌంటర్ల దగ్గర వెదికాడు. కాని ఆమె కనిపించలేదు. ఆయన కంగారు చూసిన సేల్స్‌మేన్ సలహా ఇచ్చాడు "మీరేం గాబరాపడకండి సార్. ఇక్కడే ఏ కౌంటర్ దగ్గరో ఉండి ఉంటుంది ఆమెగారు. మా షాపులో ఉన్న సేల్స్ గరల్స్ అందరూ అందమైన వాళ్ళే. మీరో కౌంటర్ దగ్గర కెళ్ళి అక్కడున్న సేల్స్ గరల్‌తో కులాసాగా కబుర్లు కొడుతున్నట్లు నటించండి. ఎక్కడున్నా సరే అర నిమిషంలో మీ దగ్గరకు పరుగెత్తుకొస్తారు మీ భార్యగారు."

భర్త ఆఫీసునుంచి ఇంటికి తిరిగొచ్చాడు సాయంత్రం. భార్య టీ అందిస్తూ –

"మీకో ఉత్తరం వచ్చింది కవరు మీద 'పర్సనల్ అండ్ కాన్ ఫిడెన్షియల్' అని రాసుంది. తెస్తానుండండి" అంది.

"అక్కర్లేదు. అందులో విశేషాలేమిటో చెబుదూ" అన్నాడు భార్య తత్వం ఎరిగిన ఆ భర్త.

ఇద్దరు వ్యాపారస్తులకి మాటామాటా వచ్చింది. పౌరుషాలు రెచ్చిపోయాయి.

"నువ్వేమనుకుంటున్నావు. నేను లక్షాధికారిని. నీబోటోళ్ళను క్షణంలో కొనగలను, అమ్మగలను. జాగ్రత్త" అన్నాడొకడు.

"ఒళ్ళు దగ్గర పెట్టుకు మాట్లాడు. నేను కోటీశ్వరుణ్ణి. నీ బోటోళ్ళను పదిమందిని కొని, అలా గోడౌన్‌లో పారేసి ఉంచగలను. అమ్మాల్సిన కర్మేం లేదు నాకు నీలాగా"

సుజాత, విజయ క్లాస్‌మేట్స్. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. పిల్లలను కన్నారు. అదృష్టంకొద్దీ ఇరుగు పొరుగునే కాపురం ఉంటున్నారు. సుజాతకు వయస్సు తక్కువచెప్పుకోడం సరదా. చూపులకు కూడా వయసు తక్కువదానిలా కనిపిస్తుంది.

"విజ్జీ నేను నూరేళ్ళు బతకదలచుకున్నానే" అంది సుజాత ఓరోజు.

"కష్టమే" పెదవి విరిచింది విజయ.

"ఏం అలా అంటున్నావు?"

"నువ్వు గతపన్నెండేళ్ళనుంచీ ఇరవై మూడో యేడులోనే ఉన్నావు. ఈ లెఖ్ఖన నూరేళ్ళు నిండడం కష్టం కదూ!"

ఒక మాటకారి కుర్రాడు, ఒక నడివయస్సు స్త్రీ రైల్వే స్టేషనులో బెంచిమీద కూర్చునున్నారు. కుర్రాడు అదేపనిగా ఆవిడ వంక చూస్తున్నాడు.

"ఏమిటి నాయనా అలా చూస్తున్నావు?"

"మీరు పరువంలో ఉన్నప్పుడు ఎంత అందంగా ఉండేవారో ఊహించుకుంటున్నాను."

ఆ మాటకు ఆవిడ పొంగిపోయి, ఉబ్బి తబ్బిబ్బయిపోయి రెండు క్షణాలు మాట్లాడలేకపోయింది. ఆ తర్వాత –

"నా పదహారోయేట అందాల రాణిగా ఎన్నికయి, బహుమతి పుచ్చుకున్నాను" అందావిడ గర్వంగా.

"ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో అందాల పోటీలు కూడా ఉండేవాండీ?

COMMENTS